సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



వ్యభిచార ముఠా గుట్టు రట్టు

వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. 8లో▸

స్వచ్ఛమైన నీటిని అందించాలి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, వీధి వ్యాపారులు జలమండలి సరఫరా చేసే తాగునీటిని గానీ, ఆర్‌ఓ వాటర్, శుద్ధి చేసిన నీటిని గానీ తప్పనిసరి ఉచితంగా అందించాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

మండుతున్న ఎండలు

సాక్షి,సిటీబ్యూరో: ఎండలు మండుతున్నాయి. సోమవారం సాధారణ ఉష్ణోగ్రత 34.4 డిగ్రీలు ఉండగా పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోద య్యాయి. మరో రెండురోజులు ఉష్ణోగ్రత ప్రభావం అధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆస్మాన్‌గఢ్‌లో 37.7, మైత్రి వనంలో 37.6, ఆసీఫ్‌నగర్‌లో 37.4, రెడ్‌హిల్స్‌లో 37.3, గచ్చిబౌలిలో 37.1 డిగ్రీలు నమోదయ్యాయి.

రంజాన్ వేళలు

మంగళవారం ఇఫ్తార్	బుధవారం సహర్
సా.6:36	ఉ.4:39

న్యూస్‌రీల్

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీ) డైరెక్టర్ కె.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో బ్యూటీ పార్లర్ కోర్సులో ఈ నెల 17 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి పాసైన మహిళలు ఈ నెల 11 తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.దరఖాస్తుతోపాటు ఎస్‌ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలన్నారు.శిక్షణ కాలంలో ఉచిత భోజనం,వసతి సౌకర్యంతోపాటు యూనిఫాం, టూల్ కిట్స్ ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 86390 79122, 97819 51167, 90007 78300 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


చెట్లే జీవకోటికి ప్రాణాధారం



పెద్దమంగళారం పాఠశాలలో మొక్కలు నాటుతున్న లక్ష్మీనివాస్ తదితరులు

మొయినాబాద్: చెట్లే జీవకోటికి ప్రాణాధారమని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్‌ఎస్‌ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. అనంతకోటి వృక్ష మహోత్సవం కార్యక్రమంలో భాగంగా టీఎస్‌ఎస్‌ఓ ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని పెద్దమంగళారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, పాఠశాల హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు అపర్ణ, భీమ్లా, పుష్ప, రవికుమార్, మల్లేశ్వరి, హేమలత, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల పరిరక్షణకు కృషి



కొంగరకలాన్‌లో దేవాదాయ భూములను గుర్తించి ఏర్పాటు చేస్తున్న బోర్డు

ఇబ్రహీంపట్నం రూరల్: దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములను పరిరక్షించడానికి కృషి చేస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం భూములను (సర్వే నంబర్ 158,159,160) గుర్తించి గ్రామస్తులతో కలిసి బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, గోపగల్ల మహేందర్, నాగేష్, మాజీ సర్పంచ్ యాదగిరి, శేఖర్, కాకి రవీందర్, ఆర్‌ఐ పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ రత్న అవార్డుకు ఎంపిక

షాద్‌నగర్: అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక మహోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ రత్న అవార్డులను అందజేయనున్నారు. సాంస్కృతిక, సామాజిక సేవా విభాగంలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువకవి రవి ప్రకాష్ హర్మాశ్ తెలంగాణ రత్న అవార్డుకు ఎంపిక చేసినట్లు సమాఖ్య వ్యవస్థాపక జాతీయ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 24న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను అందజేయనున్నట్లు వివరించారు.

రాయల్టీ.. ఎగ్గొట్టి!

రెచ్చిపోతున్న మైనింగ్ మాఫియా

- ఇన్నర్, ఔటర్ మధ్యన అడ్డగోలుగా తవ్వకాలు
- టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా మట్టి విక్రయాలు
- ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం
- పట్టించుకోని అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మైనింగ్ (మట్టి) మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొండలు, గుట్టలు, సెల్లార్ల తవ్వకాల ద్వారా వచ్చిన మట్టిని విక్రయించాలంటే ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో కొంత ఫీజు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఏ ఒక్క సెల్లార్ కాంట్రాక్టర్ కూడా ఈ ఫీజు చెల్లించడం లేదు. మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వం రూ.కోట్లలో ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తోంది. అంతేకాదు సామర్థ్యానికి మించి (ఓవర్ లోడు) మట్టితో రోడ్డుపై తిరుగుతున్న భారీ టిప్పర్లను సీజ్ చేయాల్సిన రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేయడంతో కాంట్రాక్టర్లది ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారింది.

టన్నుకు రూ.60పైగా చెల్లించాల్సి ఉన్నా..

జిల్లాలోని మెజార్టీ ప్రాంతాలు నగరానికి ఆనుకుని ఉన్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటుఇటుగా ఉన్న కొత్తపేట, సరూర్‌నగర్, నాగోల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి, రాజేంద్రనగర్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డుకు అటుఇటుగా ఉన్న పెద్ద అంబర్‌పేట, తట్టి అన్నారం, కోహెడ, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయంజాల్, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్, మణికొండ, గచ్చిబౌలి, నార్సింగి, కోకాపేట తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. పార్కింగ్ కోసం సెల్లార్లు తవ్వుతున్నారు. ఈ తవ్వకాలకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు ఇస్తుంది. వాటి నుంచి వెలువడిన మట్టి, రాయి, ఇతర ముడిపదార్థాలను మరోచోటికి తరలించాలన్నా.. ఇతరులకు విక్రయించాలన్నా మైనింగ్ శాఖ అనుమతి తప్పనిసరి. టన్ను



టిప్పర్లలో మట్టి తరలింపు

మట్టికి రూ.60పైగా రాయల్టీ చెల్లించాల్సి ఉంది. ఒకరిద్దరు మినహా చాలా మంది సెల్లార్ కాంట్రాక్టర్లు రాయల్టీ ఫీజు చెల్లించడం లేదు. టిప్పర్ల ద్వారా మట్టిని గుట్టుగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. విజిలెన్స్ అధికారులు, ఎస్‌ఓటీ పోలీసులు కూడా వీరికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలో..

ఎల్బీనగర్ చౌరస్తాలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థ భారీగా సెల్లార్ తవ్వకాలు చేపట్టింది. తవ్వకాల్లో భారీగా పేలుడు పదార్థాలు వినియోగించడం, వాటి ధాటికి పక్కన ఉన్న ఇళ్లు దెబ్బతినడం వివాదాస్పదంగా మారింది. తాజాగా పెద్ద అంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని తట్టి అన్నారం సమీపంలో మరో రియల్ ఎస్టేట్ సంస్థ ఆరు ఎకరాల విస్తీర్ణంలో సెల్లార్ తవ్వకాలు చేపట్టింది. సెల్లార్ తవ్వకానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ మట్టి అమ్మకానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా రోజుకు కనీసం వంద లారీల మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి గుట్టుగా ఇతరులకు విక్రయిస్తున్నారు. విషయం తెలిసీ ఇటు మైనింగ్ అటు రెవెన్యూ అధికారులు కిమ్మనకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు పెద్ద ఎత్తున చేపట్టిన ఈ తవ్వకాలతో సమీప కాలనీలు, ఇళ్లపై భారీగా దుమ్ముధూళి చేరుతోంది. దీనికితోడు భారీ శబ్దాలు వస్తుండటంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

కనీస రక్షణ చర్యలు శూన్యం

నిజానికి సెల్లార్ తవ్వాలంటే సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతి తీసుకోవడంతో పాటు కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలి. తవ్వకాల సమయంలో దుమ్ముధూళి బయటికి వెళ్లకుండా ఆ భూమి చుట్టూ రేకుల షీట్స్ ఏర్పాటు చేసి వాహనాలు తిరిగే దారిలో తరచూ నీళ్లు చల్లాలి. పేలుళ్ల ధాటికి రాళ్లు పక్కన ఉన్న ఇళ్లు, ఇతర భవనాలపై పడకుండా భద్రతా చర్యలు చేపట్టాలి. సెల్లార్ తవ్వకాల్లో పని చేసే సిబ్బందికి ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు రక్షణ కల్పించాలి. ఏ ఒక్క కాంట్రాక్టర్ కూడా ఈ చర్యలు చేపట్టడం లేదు. ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు పోలీసు సహా ఆయా శాఖల అధికారుల వచ్చి హడావుడి చేయడం, తాత్కాలికంగా కేసులు నమోదు చేయడం మినహా అక్రమ సెల్లార్లు, మట్టి తవ్వకాలను అడ్డుకోలేకపోతున్నారు. ఇళ్ల మధ్యన భారీ సెల్లార్లు తవ్వుతుండటం, ఇరుకైన రోడ్లపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మాకు సంబంధం లేదు

సెల్లార్ నిర్వాహకులు జీహెచ్‌ఎంసీకి ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు (ఈఐఎఫ్) చెల్లిస్తుంటారు. మైనింగ్‌శాఖకు, సెల్లార్ తవ్వకాలకు సంబంధం లేదు. సెల్లార్ కాంట్రాక్టర్లు చెల్లించే ఈఐఎఫ్ స్థానిక సంస్థల ద్వారా మైనింగ్ శాఖకు చేరుతుంది. సెల్లార్ తవ్వకాలకు, అక్కడ చేపట్టే బ్లాస్టింగ్ వర్కులకు అనుమతులు ఉన్నాయా? లేదా అనే అంశాన్ని మున్సిపాలిటీలే చూసుకుంటాయి. వాటితో మాకు సంబంధం లేదు.

– ప్రవీణ్‌రెడ్డి, జిల్లా అధికారి, మైనింగ్‌శాఖ

సాఫ్ట్‌గా బుద్వేల్!

ఐటీ కారిడార్‌కు సరికొత్త డెస్టినేషన్

- భారీ లేఅవుట్‌కు హెచ్‌ఎండీఏ చర్యలు
- హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల్లో స్థలాల కొరత
- రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ



సాక్షి, సిటీబ్యూరో: ఐటీ సంస్థలు ఇప్పుడు బుద్వేల్ వైపు దృష్టి సారించాయి. రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఔటర్‌కు అందుబాటులో ఉండడంతో ఐటీ సంస్థలు బుద్వేల్‌ను సరికొత్త డెస్టినేషన్‌గా ఎంపిక చేసుకుంటున్నాయి. భారీ లే అవుట్‌కు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టడంతో ఐటీ సంస్థలతో పాటు ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలు సైతం ఆసక్తి కనబరుస్తున్నాయి. మరోవైపు అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించేందుకు ఈ లేఅవుట్ అనుకూలంగా ఉండనున్న దృష్ట్యా మధ్యతరగతి, ఉన్నత ఆదాయ వర్గాలు సైతం బుద్వేల్‌లో నివాసం ఏర్పాటు చేసుకొనేందుకు దృష్టి సారించాయి. బుద్వేల్‌లో భారీ వెంచర్ ఏర్పాటు చేయడం ద్వారా పెద్దఎత్తున ఆదాయాన్ని ఆర్జించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. హిమాయత్‌సాగర్‌కు సమీపంలో ఏర్పాటు చేయనున్న ఈ లేఅవుట్‌ను 'లేక్‌సిటీ'గా అభివృద్ధి చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

రూ.200 కోట్లతో అభివృద్ధి..

- బుద్వేల్‌లోని సుమారు 182 ఎకరాల ప్రభుత్వ భూములను గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయనున్నారు. ఒక్కో ప్లాటు విస్తీర్ణం 6.13 ఎకరాల నుంచి 14.58 ఎకరాల వరకు ఉంటుందని అంచనా. ఈ లేఅవుట్‌లో సుమారు రూ.200 కోట్లతో విశాలమైన రహదారులు, విద్యుత్, డ్రైనేజీ, పార్కులు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. అత్యాధునిక సదుపాయాలతో లే అవుట్‌ను అభివృద్ధి చేసేందుకు ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది.
- ఐటీ సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు అనుకూలంగా ఉండేవిధంగా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. నగరంలో మొదట హైటెక్ సిటీని అభివృద్ధి చేశారు. ఆ తర్వాత గచ్చిబౌలి, నాలెడ్జి సిటీ, తాజాగా కోకాపేట్‌లు అభివృద్ధి చెందాయి. ఇప్పుడు బుద్వేల్ ఆ జాబితాలో చేరనుంది. ఔటర్‌కు చేరువలో, ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో ఉండడంతో పాటు ఎక్కడి నుంచి ఎక్కడికైనా క్షణాల్లో చేరుకొనేందుకు అవకాశం ఉంది.

బహుళ ప్రయోజనాలు

- హెచ్‌ఎండీఏ ఈ వెంచర్‌ను బహుళ ప్రయోజనాల జోన్‌గా అభివృద్ధి చేయనుంది. కార్యాలయ సముదాయాలు, నివాసాలు, రిటైల్ వ్యాపారం, ఎంటర్‌టైన్‌మెంట్, హెల్త్‌కేర్ వంటి వివిధ రంగాలకు చెందిన కార్యకలాపాలకు అనుకూలంగా తీర్చిదిద్దనున్నారు. ఈ వెంచర్‌లో వేలం ద్వారా ప్లాట్లను కొనుగోలు చేసేవారికి నెల రోజుల వ్యవధిలోనే నిర్మాణ అనుమతులన్నింటినీ అందజేయాల ని అధికారులు భావిస్తున్నారు. హైరైజ్ బిల్డింగ్‌లు ఎక్కువగా నిర్మించే అవకాశం ఉంది.
- కోకాపేట్‌లోని నియోపోలీస్ వెంచర్ తరహాలో దీనిని అభివృద్ధి చేయనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం నగరంలోని ఐటీ కారిడార్‌లలో స్థలాల లభ్యత తక్కువగా ఉండడం వల్ల బుద్వేల్ వంటి వెంచర్‌ల అవసరం అనివార్యంగా మారింది. బుద్వేల్‌ను అభివృద్ధి చేస్తే నగరంలోని గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తదితర ప్రాంతాల్లోని పలు ఐటీ సంస్థలకు అక్కడికి తరలి వెళ్లే అవకాశం ఉంది.

ఠాణాలను సందర్శించిన ట్రైయినీలు



సీఐ లింగయ్యతో సమావేశమైన ట్రెయినీ ఐపీఎస్‌ల బృందం

యాచారం: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రెయినీ ఐపీఎస్‌ల బృందం సోమవారం యాచారం పీఎస్‌ను సందర్శించింది. శుభంకికుమార్ నిక్కిప్రసాద్, విశ్వంప్రసాద్, రుషం రుణావల్ తదితరులు యాచారం పీఎస్‌ను సందర్శించి సీఐ లింగయ్యతో సమావేశమయ్యా రు. కేసుల నమోదు, ఫిర్యాదుల స్వీకరణ, ఫిర్యాదుదారులకు సూచనలు, సలహాలు, గ్రామాల్లో పోలీస్ సిబ్బంది పర్యటన తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ లింగయ్యతో కలిసి తమ్మలోనిగూడలో ఏడాది క్రితం జరిగిన ఓ హత్య కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కడ్తాల్‌లో ..

కడ్తాల్: హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐదుగురు ట్రెయినీ ఐపీఎస్ అధికారుల బృందం సోమ వారం కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల నిర్వహణ, కేసుల నమోదు, క్రైంరేట్, కేసుల విచారణ, ఎఫ్‌ఐఆర్ నమోదు తదితర విషయాలను స్టేషన్ హౌస్ ఆఫీసర్ హరిశంకర్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండల పరిధిలో ని సాలార్‌పూర్, మైసిగండి గ్రామాల్లో పర్యటించి పోలీసింగ్ అమలుపై తెలుసుకున్నారు.

ఆమనగల్లులో..

కడ్తాల్: జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ట్రెయినీ ఐపీఎస్ అధికారుల బృందం సోమవారం ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుందరయ్య స్టేషన్ల నిర్వహణ, కేసుల నమోదు, క్రైంరేట్, కేసుల విచారణ, ఎఫ్‌ఐఆర్ నమోదు తదితర విషయాలపై సమగ్రంగా వారికి వివరించారు.

కొత్తూరులో..

కొత్తూరు: శిక్షణ పొందుతున్న పలువురు ఐపీఎస్ అధికారులు సోమవారం కొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, ఇటీవల చోటు చేసుకున్న పలు నేరాలు, రహదారి భద్రతకు సంబంధించిన విషయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. స్థానిక ఎస్‌ఐ శంకర్ నేరాల గుర్తింపు, పరిశోధన తీరుపై గ్రామీణ పోలీసులు అనుసరిస్తున్న విధానాలను వారికి వివరించారు.

12న ఇఫ్తార్ విందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహమూద్ అలీ

సాక్షి, సిటీబ్యూరో/గన్‌ఫౌండ్రి: రంజాన్ సందర్భంగా ఈ నెల 12న ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హోంమంత్రి మహమూద్ అలీ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై ఆయన మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. జీఏడీ, పోలీస్, జీహెచ్‌ఎంసీ, ఐఅండ్‌పీఆర్, హార్టికల్చర్, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రిసిటీ, మెడికల్ అండ్ హెల్త్, వాటర్ వర్క్, ఫైర్ స్టేషన్, స్పోర్ట్స్ , ఫుడ్ తదితర శాఖల అధికారులు పరస్పర సహాయ సహకారాలతో ఇఫ్తార్ విందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ప్రభుత్వం తరఫున హిందూ, ముస్లిం, క్రిస్టియన్, పండగలు అధికారకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మంత్రి సబితా రెడ్డి



బీఆర్‌ఎస్ నాయకురాలు యాస్మిన్‌కు పండ్లు అందిస్తున్న మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తూనే పేదలకు దానధర్మాలు చేయడం గొప్ప విషయమని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడీషరీఫ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దసరా సందర్భంగా బతుకమ్మ చీరలు, క్రిస్మస్ పండుగకు కానుకల మాదిరిగానే రంజాన్‌కు తోఫా అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆమె ప్రత్యేక ప్రార్థనలు జరిగే ఈద్గాను పరిశీలించి రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- 6 సెల్ ఫోన్లు, రూ.12,500 స్వాధీనం
- నిందితులపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు
- పోలీసులను అభినందించిన డీసీపీ



వ్యభిచార గృహంలో అదుపులోకి తీసుకున్న నిందితులు

షాద్‌నగర్ రూరల్: వ్యభిచార ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. వ్యభిచార గృహంపై దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. ఏసీపీ కుశాల్కర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. నాగర్‌కర్నూల్ జిల్లా, ఇంద్రకల్ తండాకు చెందిన ముడావత్ తార అలియాస్ బుజ్జి, ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన కమ్మరి వెంకటేశ్ కొంత కాలంగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. కర్నూల్ చెందిన బాష వీరివద్దకు అమ్మాయిలను పంపుతూ సహకరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బాష నాలుగు రోజుల క్రితం ఓ అమ్మాయిని షాద్‌నగర్‌కు పంపించపాడు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సలీం.. తార, వెంకటేశ్‌కు సహాయకుడిగా ఉంటూ విటుల నుంచి డబ్బు వసూలు చేస్తుంటాడు. ఈనెల 9న బిహార్‌కు చెందిన హసనుల్లాఖాన్, ఫరూఖ్‌నగర్ గుండుగేరికి చెందిన శీలం సాయికుమార్ వద్ద రూ.1,500 చొప్పున ఒప్పందం చేసుకుని, వ్యభిచార గృహానికి తీసుకువచ్చారు. వ్యభిచారం నడుపుతున్నట్లు సమాచారం అందుకున్న షాద్‌నగర్ పోలీసులు, శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఏసీపీ కుశాల్కర్ పర్యవేక్షణలో పట్టణ సీఐ నవీన్‌కుమార్ నేతృత్వంలో మెరుపు దాడి చేశారు. తార, వెంకటేశ్, సలీం, హసనుల్లాఖాన్, సాయికుమార్‌తో పాటు బాధిత అమ్మాయిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. వీరి నుంచి 6 సెల్‌ఫోన్లు, రూ.12,500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, సోమవారం రిమాండ్‌కు తరలించారు. బాధిత యువతిని మహేశ్వరంలోని ప్రజ్వల హోంకు తరలించారు.

పోలీసులకు డీసీపీ అభినందన

కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ నవీన్‌కుమార్, శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడంలో పోలీసులు పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కేసును ఛేదించిన వారికి రివార్డులు అందజేస్తామని డీసీపీ తెలిపారు.

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు దీర్ఘకాలిక రుణాలను చైర్మన్ బి.సతీష్ అందజేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిలో భాగంగా గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలు కోసం రైతులకు ఈ రుణాలను అందజేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. తాజాగా రూ.62,38,400 రుణాల చెక్కులను పంపిణీ చేయగా.. ఇప్పటి వరకు సొసైటీ పరిధిలో 89 మంది రైతులకు రూ.3.59కోట్లు రుణాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రభుసాగర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం

శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని ఎంపీటీసీ సభ్యురాలు యా టకారి సంగీత సిద్దేశ్వర్ అన్నారు. పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న విద్యా వాలంటీరుకు చెల్లించే 10 నెలల వేతనాన్ని తన సొంత డబ్బు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును అశ్రద్ధ చేయకుండా మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదు

శంషాబాద్: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని ఐదోవార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో కళ్లపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, కౌన్సిలర్ మస్రత్‌జాన్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో సహపంక్తి భోజనాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో సహపంక్తి భోజనాలు చేశారు. రాష్ట్ర మహిళా మోర్చా పిలుపు మేరకు సామాజిక న్యాయం(ఏప్రిల్ 06 నుంచి 14వ తేదీ) వరకు ఈ కార్యక్రమాలను ని ర్వహించారు. సోమవారం రాజేంద్రనగర్ డివిజన్ మ హిళా మోర్చా అధ్యక్షురాలు గడిల పద్మావతి అధ్యక్షతన రాజేంద్రనగర్ ఆశావర్కర్ తీగల మీనా ఇంట్లో సామూహిక భోజనాలు చేశారు. రంగారెడ్డి (అర్బన్) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మళ్లీ శ్మశానవాటిక వివాదం



చేవెళ్ల మండలం దామరగిద్దలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

దామరగిద్దలో ఉద్రిక్తత

చేవెళ్ల: మండల పరిధిలోని దామరగిద్దలో మరోసారి శ్మశాన వాటిక వివాదం నెలకొంది. గ్రామంలోని పాత శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించాలని ఓ వర్గం.. కొత్తగా నిర్మించిన శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు నిర్వహించాలని మరో వర్గం పట్టుబట్టడంతో రెండు నెలలుగా ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. అయితే సోమవారం గ్రామానికి చెందిన శంకరమ్మ మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు పాత శ్మశానవాటికలో ఏర్పాట్లు చేస్తుండగా.. మరోవర్గం వారు అభ్యంతరం తెలిపారు. పాత శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఓ వర్గం వాదిస్తుండగా.. మరో వర్గం వారు అభ్యంతరం తెలపడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, గురువయ్యగౌడ్ ఇరువర్గాలను శాంతింపజేసేందుకు ప్రయత్నం చేశారు. చివరకు మృతురాలి కుటుంబ సభ్యులు తమ సొంత పొలంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటామని చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. శ్మశాన వాటికకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహనీయుల జయంత్యుత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట చౌరస్తాలో ఈ నెల 22 న జరిగే మహనీయుల జయంత్యుత్సవాల ముగింపు సభ బ్రోచర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సోమవారం ఆర్‌కేపురంలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఉత్సవాల కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డికి అంబేడ్కర్ జయంతి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దాసరి కిరణ్, ఉపాధ్యక్షుడు దొబ్బ అంజన్ కుమార్, కోశాధికారి వావిలాల ఇందుమతి, సహాయ కార్యదర్శి దోమలపల్లి శివకాంత్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, శివ నాయక్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ నవీన్‌కుమార్

షాద్‌నగర్: సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కండ్లకోయలో ఉన్న నిమ్మల కన్వెన్షన్ హాలులో బ్రిలియంట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 8 విభాగంలో అక్షిత బంగారు, హరిప్రియ వెండి, బహుమతి, సాయిదీప్తి కాంస్య పతకాతలు సాధించారు. అదేవిధంగా అండర్ 12 విభాగంలో మమత ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం, అండర్ 8 బాలుర విభాగంలో పార్థు బంగారు పతకాలను సాధించినట్లు తెలంగాణ స్కూల్స్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ చెన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా బహుతులను గెలుపొందిన విద్యార్థులను సోమవారం షాద్‌నగర్ సీఐ నవీన్‌కుమార్ అభినందించారు. కరాటే మాస్టర్ చెన్నయ్యను ఘనంగా సన్మానించారు.

ప్రజాప్రతినిధి దూషించాడని..

మహిళ ఆత్మహత్యాయత్నం

తలకొండపల్లి: ఓ మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండల పరిధిలోని పడకల్‌కు చెందిన పద్మమ్మను ఓ ప్రజాప్రతినిధి అకారణంగా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో తన ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపారు.

గడ్డివాములు దగ్ధం



కాలి బూడిదైన గడ్డివాము

కేశంపేట: ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. టీ చంద్రయ్య, జీ మహేందర్‌ల గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు తెలిపారు. వేసవి కాలం కావడంతో పశువుల మేత కోసం గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిమ్మాపూర్ శివారులో ఘటన

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ శివారులో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం, దేవునిపడకల్ గ్రామానికి చెందిన రవీందర్(48) కొన్నేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధి కోసం తిమ్మాపూర్‌కు వచ్చాడు. తిమ్మాపూర్ శివారులోని ఐటీసీఎల్ ప్లాంట్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఐటీసీఎల్ పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా కొత్తూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శంకుస్థాపనలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు

రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి



విజయదుర్గాకాలనీలో పర్యటిస్తున్న రంగారెడ్డి

హస్తినాపురం: అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం తప్ప.. పనుల్లో పురోగతి కనిపించడం లేదని రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. సమస్యలు పరిష్కారం గాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సోమవారం ఆయన హస్తినాపురం డివిజన్ పరిధిలోని విజయదుర్గానగర్, చైతన్యనగర్, వివేకానందకాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్‌ల పనుల కోసం 2021 డిసెంబర్ 2న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారని, ఏడాది దాటినా నేటికీ ఆ పనులు ప్రారంభం కాకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయని ఆయన విమర్శించారు. హస్తినాపురం డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో వరద ముంపు సమస్య తీవ్రంగా ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చైతన్యనగర్ కాలనీ అసోసియేషన్ వారు 2023 జనవరి 27న ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేస్తే పదిరోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారని, నేటికీ ప్రారంభం కాలేదని కాలనీవాసులు చెప్పారని రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రజలు తిరుపతి, విజయ్‌కుమార్, ఎరుకల మల్లేశ్‌గౌడ్, అరుణసింగ్, శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తులో విషం తాగిన మహిళ

చికిత్స పొందుతూ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం మత్తులో క్రిమి సంహారక మందు సేవించి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం ప్రకారం.. మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన పోతులపల్లి అలివేలు కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉంటారు. కూలి పని చేసుకుంటూ జీవించేది. మద్యానికి బానిసై ఆదివారం రాత్రి మద్యం మత్తులో క్రిమిసంహారక మందు సేవించింది. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించింది. కేసు దర్యాప్తులో ఉంది.

తండ్రి దారుణ హత్య

కుమారుడి ఘాతుకం

ఉప్పల్: తండ్రి రెండో వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని కుమారుడు సుత్తితో మోది తండ్రిని దారుణంగా హత్య చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్, శ్రీనివాసపురంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసపురం యాదయ్య హోటల్ ప్రాంతానికి చెందిన సద్యాల పాండు సాగర్ (54) టెంట్ హౌస్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు పవన్ సాగర్ టెంట్ హౌస్ నిర్వహణలో తండ్రికి సహకరించేవాడు. అయితే నాలుగేళ్ల క్రితం మొదటి భార్యను వదిలేసిన పాండు సాగర్ ఫిర్జాదిగూడ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మిని రెండో పెళ్లి చేసుకుని వేరు కాపురం పెట్టాడు. మూడేళ్లుగా మొదటి భార్య వద్దకు రాకపోగా ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు ఇవ్వడం లేదు. ఈ విషయమై పవన్‌కు అతడి తండ్రికి మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కూడా వారిద్దరి మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో ఆగ్రహానికిలోనైన పవన్ టెంట్ హౌస్‌కు వెళ్లి సుత్తి తీసుకువచ్చి నేరుగా శ్రీరామ అపార్ట్ మెంట్‌లో ఉంటున్న తండ్రి ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన పాండు సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతినెలా ఒకటిన పెన్షన్ ఇవ్వాలి

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బస్వరాజు

అనంతగిరి: ప్రతి నెలా ఒకటో తేదీ పెన్షన్ చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జొన్నల బస్వరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ పెన్షన్ దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెన్షన్ ఆలస్యం చేయవద్దన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిధిలో గల అన్ని ఆస్పత్రులలో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 3 డీఏలు వెంటనే మంజూరు చేయాలన్నారు. 2023లో పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. 15 సంవత్సరాల కంట్రిబ్యూషన్ 12 సంవత్సరాలకు కుదింపు చేయాలన్నారు. పుణ్య క్షేత్ర దర్శనం కోసం ప్రతి సంవత్సరం ఒక నెల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ మెడికల్ బిల్స్ చెల్లించాలని విన్నవించారు. ప్రతి జిల్లాలో ఒక వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ట్రెజరరీ జూకారెడ్డి, వికారాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు మాణిక్ ప్రభు, సంఘం నాయకులు పెంటయ్య, మల్లారెడ్డి, చెన్నారెడ్డి, రాధాకృష్ణ, మల్లేష్, శేఖర్, శ్రీహరి, వెంకట్‌సింగ్, నర్సిరెడ్డి, కిష్టయ్య, బాలరాజు పాల్గొన్నారు.

శివకుమార్‌కు సన్మానం

యాచారం: తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తన ప్రతిభను చూపిన గడ్డమల్లయ్యగూడకు చెందిన శివకుమార్‌కు ఘన సన్మానం లభించింది. ఈ నెల 9,10 తేదీల్లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు భాషలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న శివకుమార్ సాహితీ బ్రహ్మోత్సవాలకు ఎంపికయ్యాడు. 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన సాహితీ బ్రహ్మోత్సవాల్లో శివకుమార్ సాహిత్య చర్చలు, కవితా పఠనంలో చక్కటి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ యాజమాన్యం ప్రతినిధులు ప్రతాప్, హరిసర్వోత్తమ నాయుడు, కొల్లి రమావతి, బత్తుల అశోక్ తదితరులు శివకుమార్‌ను ఘనంగా సత్కరించి, సన్మానించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్.

రాజేంద్రనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అనునిత్యం కృషి చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతోత్సవ కమిటి అధ్యక్షులు పలుగుచెరువు మహేష్, ప్రధాన కార్యదర్శి బి.టి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరై ఉత్సవ కమిటీ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో అందరు నడవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి కోశాధికారి మంగళారం శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు వనం నర్సింహ్మామాదిగ పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: వేసవి కాలంలో ప్రజలకు మంచి నీటిని అందించడంలో అధికారులు విఫలమవుతున్నారని బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన మంచినీటి పైపులైన్ మరమ్మత్తు పనులను ఆయన అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మంచినీటి సరఫరా పైపులైన్ పనులు నత్తనడకన సాగుతుండడంతో నీటి సరఫరా జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కేశవనగర్ కాలనీ, ఎర్రబోడ, నలందానగర్, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా అసలు జరగడం లేదన్నారు. ఈమేరకు రాజేంద్రనగర్ జలమండలి జీఎం చంద్రశేఖర్, డీజీఎం జమీల్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మూల శ్రీనివాస్‌గౌడ్, సాయియాదవ్, ఉపేందర్‌రెడ్డి, కాకుళారం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతగిరి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సోమవారం సాయంత్రం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలానికి చెందిన హరీష్‌కుమార్‌కు ఇద్దరు భార్యలు. ఇద్దరితోనూ అతనికి సఖ్యత లేదు. సోమవారం మద్యం మత్తులో హరీష్‌కుమార్ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో స్థానికులు మంటలు ఆర్పి వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు.

పడకల్‌లో మహిళ..

తలకొండపల్లి: ప్రజాప్రతినిధి దూషించాడని ఓ మహిళా ఆత్మహత్యకు యత్నించింది. మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన పద్మమ్మను ఓ ప్రజాప్రతినిధి అకారణంగా అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె సోమవారం తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో తన ఇంట్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు కుటుంబ సభ్యులు తెలిపారు.